# బాధానందం



కొంతమందిని కదిలిస్తే చాలు ఎప్పుడూ ఏదో ఒక బాధామయ గాథ చెబుతూ, ప్రపంచంలోని బాధంతా తామొక్కళ్లే భరిస్తున్నట్టు ముఖ కవళికలు మారుస్తూ, ఎదుటివాళ్ల సానుభూతితో సంతృప్తి పడుతుంటారు.

మరి కొంతమంది ఎదుటివాళ్లు బాధపడుతుంటే పైకి పరితాప ప్రవచనాలు ప్రవచిస్తూనే, లోలోపల పరమానందం పొందుతుంటారు.

మన కథానాయకుడు బ్రహ్మానందం ఈ బాధానందం పొందే వ్యక్తుల్లో... ఒకింత ప్రత్యేకత కల్గిన వ్యక్తి.

మంచి ఉద్యోగం, పోష్ ఏరియాలో ఖరీదైన

ఎం. వెంకటేశ్వరరావు

అపార్ట్‌మెంటు, కారుతో సహా సకల వసతులతో తులతూగుతున్నా, ఏదో ఒక బాధ సృష్టించుకుని... సంతోషపడటం బ్రహ్మానందం దినచర్యలో అతి ముఖ్యమైనది. ఏదో ఒక బాధ లేకపోతే సంతోషంగా ఉండలేడు. దొరికిన బాధని భిన్న కోణాల్లో చీల్చి, చెండాడి తనకు తాను మాత్రమే ఆనందించే మనసున్న మనిషి. ఒకే ఒక్క రోజు సదరు బాధ బ్రహ్మానందం బారి నుండి తప్పించుకుందామనుకున్నా... ఏదో విధంగా దాన్ని బంధించి, బాధానందం పొందే యుక్తులన్నీ మనవాడికి కరతలామకాలే.

* * *

ఆరోజు ఉదయం ఐదుగంటలకే నిద్రలేచి ఏ బాధని బంధించాలా అని ఆలోచిస్తుంటే, 'సారీ ఫర్ ద ఇంట్రప్షన్' అన్నట్టు పక్కన పడుకున్న భార్య గురక పెట్టడం విన్న బ్రహ్మానందానికి సడన్‌గా బాధొచ్చి వలలో పడ్డ చేపలా... మెదడులో దూరింది.

రాత్రంతా నిశ్శబ్దంగానే పడుకుంది గదా! మరి తెల్లవారుఝామున ఇంత పెద్దగా గురక పెట్టడం ఏదైనా కొత్త రోగమేమో అనుకుని, తన ఆలోచనల నుండి దొట్లు నూడిల్స్‌లా లాగసాగడు. మనవాడి బాధల వేటలో ఈ వేళ ఐదుగంటలకే బోణీ అయిందన్న మాట.

"వసూ...! వసూ...!"

"..........."

"వసుంధరా!"

"ఊఁ..."

"వసూ... నిన్నే"

"అబ్బా! ఏవిటండీ! ఐదు గంటలకే పారాయణ మొదలెట్టారు. మీరూ... కాసేపు పడుకోండి" అని నిండా ముసుగుతన్ని పడుకున్న భార్య నిద్రని భరించలేని బ్రహ్మానందం, ఆమె మొహం మీది దుప్పటి తొలగించి, నుదిటి మీద చెయ్యేసేసరికి వెచ్చగా తగిలింది. అంతే! మన వాడి అనుమానం ఆకాశమెత్తుకి కదలి తరంగంలా ఎగసిపడింది. వేగంగా లేచెళ్లి థర్మామీటర్ తెచ్చి టెంపరేచర్ చూశాడు. వెంటనే ఫ్యామిలీ డాక్టర్ పద్మనాభానికి ఫోన్ చేశాడు.

"చూడండి! మిస్టర్ బ్రహ్మానందంగారూ... ఇంకా సూర్యోదయం కూడా కాలేదు. డోన్ట్ డిస్టర్బ్ మి. తొమ్మిది గంటలకి క్లినిక్‌కి తీసుకురండి" అని టప్న ఫోన్ పెట్టేసాడు.


"కొంపతీసి ఈ డాక్టర్‌కేమైనా అనారోగ్యమేమో, డాక్టరే పేషెంటైతే... ఇహ పేషెంట్లనేం చూస్తాడు నా బొంద" అనుకుని అర్జంటుగా ఫ్యామిలీ డాక్టర్ని మార్చెయ్యాలని తీర్మానించుకున్నాడు.

భర్త స్వభావం తెల్సిన భార్య గాబట్టి తనింకా తాత్సారం చేస్తే ఇంకెవరికైనా ఫోన్లు చేసి హంగామా చేస్తాడనుకుని దభాల్న లేచి కూచుంది వసుంధర.

"వ..సూ... నీకు... జ్వ...రం..." హాశ్చర్యంగా అడిగాడు.

"జ్వరం లేదు... గిరం లేదు... లేచి పాచి మొహం కడుక్కురండి కాఫీ ఇస్తాను" అనామె లేచెళ్లేసరికి, నీళ్లురాని కుళాయి నుండి ఒక్కసారిగా నీళ్లు ధారగా పడ్డట్టు బ్రహ్మానందం బాధ బ్రద్దలైంది.

భార్య కాఫీ గ్లాసులో తెచ్చివ్వగానే... "రోజూ కప్పులో ఇచ్చేదే... ఈ వేళ గ్లాసులో ఇచ్చిందేమిటి? మొన్నామధ్య కొన్న కప్పుల సెట్టు పగలగొట్టేసిందేమో..." అనుకుని కాఫీ తాగటం మాని, డైనింగ్ హాల్లో ఉన్న క్రోకరీ అల్మారా వైపు దృష్టి సారించాడు. అక్కడ కప్పులు కన్పించలేదు... అంతే! మన వాడిలో బాధ ఉధృత




మైంది. ఆ సంతోషంలో -

"వసూ! కాఫీ వేడిగా మాడిపోయేట్టిచ్చా వేంటి? కప్పు తీసుకురా!" అన్నాడు.

ఆమె లేచెళ్లి తెచ్చేలోపల బ్రహ్మానందం బాధ బారెడై, పరిపరి విధాల ప్రసరించడం మొదలైంది. కప్పులు కడుగుతుంటే జారిపడి పగిలిపొయ్యాయేమో, ఆ పెంకులు కాళ్లో గుచ్చుకున్నాయి కాబోలు, అందుకే కాలు... నెప్పెక్కువై జ్వరం వచ్చింది. కాల్లో దిగబడ్డ పెంకునలా వదిలేస్తే... కాలుకి పుండై... మళ్లీ డాక్టరు, కాలుకి కట్టు, మందులు... 70MM లో ఆ విషయాన్ని ఆలోచిస్తూ, ఆ బాధామయ లహరిలో ఓలలాడుతున్న అరనిమిషంలోనే భార్య కప్పు తెచ్చివ్వడంతో మనవాడి బాధ మార్గ మధ్యంలోనే బస్ దింపినట్టయింది.

మరో కొత్త బాధ వెతుకులాడుతున్న బ్రహ్మానందం బ్రెయిన్‌లో మరుగునపడ్డ బాధొకటి గుర్తుకొచ్చింది. నిన్న రాత్రి బెడ్రూం కిటికీ దగ్గర ఎవరో తొంగి చూసినట్లన్పించింది. కలో! నిజమో!! అంతుబట్ట లేదు. వాచ్‌మెన్ నిద్రపోతున్న సమయంలో దొంగెవరైనా వచ్చాడేమో! ఇదే గ్రౌండు ఫ్లోరుతో ఉన్న ఇబ్బంది... అనుకుని, అసలా బాధని ఇంతసేపూ మర్చిపోయినందుకు తనను తాను తిట్టుకుని, ఆఫీసుకెళ్లేటపుడు పోలీస్ కంప్లయింటివ్వాలనుకుని నిర్ణయించేసుకుని, ఆ బాధని పెండింగ్‌లో పెట్టి షేవింగ్ ప్రహసనాన్ని ప్రారంభించాడు.

షేవింగ్ సమయంలో ప్రతిరోజు బ్రహానందం విచిత్రానందం అనుభవిస్తుంటాడు. మనవాడికి ఎడమ బుగ్గమీద పెసరబద్దంత పుట్టుమచ్చుంది. అది మనవాడికి పుట్టుకతో పుట్టినా, ప్రతిరోజూ దాన్ని కొత్తగా చూస్తున్నట్టు, మొహాన్ని ముప్ఫయి వంకర్లు తిప్పుతూ అద్దం ముందు అభినయం చేస్తుంటాడు. పుట్టుమచ్చ పెరిగి పెద్దదయి మొహమంతా కప్పేస్తున్నట్టు అపోహానందం అనుభవిస్తుంటాడు. అయినా సరే ఆ బాధాగాధ ఎవ్వరికీ చెప్పడు. ఎందుకంటే ఎవరైనా విని ఏమందో లేక ఏ లేజర్ ట్రీట్‌మెంటైనా

సిఫార్సు చేస్తే. అది వాడాక, ఆ పుట్టుమచ్చ మాయమైతే ఆపై ప్రతిదినం తన బాధోత్సాహాన్ని తిరిగి తెచ్చే తాతెవరు దిగొస్తాడన్న బాధ మరి.


ఇహ స్నానఘట్టం మనవాడి దినచర్యల్లో అతి ముఖ్యమైనదీ అమోఘమైనదీను. సబ్బు బ్రాండు మారితే చాలు వళ్లంతా మంటలు పుడుతున్నట్టు, స్కిన్ అలర్జీ వచ్చినట్టు... బాధ అనుభవిస్తుంటాడు. ఆ తర్వాత డెర్మటాలజిస్టు దగ్గర మందులు వాడితే, వళ్లంతా దద్దులొచ్చినట్టు, మొహమంతా ముడతలు పడి ఒక్కమగాడు సినిమాలో ముసలి బాలకృష్ణలా ఊహించుకుంటాడు. సబ్బు బ్రాండు తనకు తెలియకుండా మార్చినందుకు భార్యపై చిరుకోపం ప్రద్శించినా, అంతరంగంలో మాత్రం ఆత్మానందాన్ని అనుభవిస్తుంటాడు.

స్నానం సంతోషంగా ముగించుకొచ్చి, దేవుడి ముందు కూచున్న బ్రహ్మానందానికి, ఎదురుగ్గా కన్పిస్తున్న ఏడుకొండల వెంకన్నని చూస్తున్నకొద్దీ చిన్న అనుమానం అంకురం వేసి, అది ఇంతై, అంతై, ఎంతెంతో అవుతుంది ప్రతిరోజూ. "అసలు వెంకన్నకి అలమేలు మంగ కుడి ప్రక్కనే ఎందుకుండాలి? పద్మావతి ఎడమ వైపునే ఎందుకుండాలి? మార్చిచూస్తే? కుడి ఎడమైతే... వంటి అదనపు అనుమానాలు అధికమవుతుంటాయి. విగ్రహాన్ని మారిస్తే అపచారం అవుతుందేమో నన్న అలజడితో బాధాపూజ ప్రారంభిస్తాడు. బలవంతంగా జరిపి ఠపీమని కళ్లు తెరుస్తాడు. ఎదురుగ్గా శివుని పటానికి వేసిన తులసి మాలను చూడగానే... కొత్త బాధ తొందరగా దొరికినందుకు బ్రహ్మానందభరితుడై, భార్యను పిలిచి చిరుకోపం ప్రదర్శించి, అసలు శివుడికి తులసిమాల ఎందుకు వెయ్యకూడదో తనకు తెలిసిన ఇతివృత్తాన్ని సవివరంగా వివరించి, ముగించాకగానీ గుర్తుకు రాదు... ఆ బాధ అక్కడితో బందవుతోందని.

అల్పాహారం• తింటూ బాధావేటలో ఉన్న మనవాడి చెవులకి టి.వి.లో విన్పిస్తున్న వార్త చెవుల్ని చేరి, ఢమాల్న కుర్చీనించి కిందపడేలా చేసింది. 'మహారాష్ట్రలో భూకంపం. బిల్డింగులు కూలిపోవటం, వేలాది మంది ప్రాణాలు కోల్పోవడం...' వింటున్నకొద్దీ బ్రహ్మానందం బాడీ అంతా ప్రకంపించిపోతోంది. తమ అపార్టుమెంటంతా భూసమాధవుతున్నట్టు బాధతో మెలికలు తిరగసాగాడు. సీసానుండి బయటపడి పెరిగిపోతున్న భూతంలా ఈ బాధ విస్తరించడం మొదలెట్టింది. ఇవ్వాళ్టి బాధల్లోకెల్లా అతి పెద్ద బాధ ఇదే. ఈ బాధానందాన్ని కన్పించిన వాళ్లందరితోనూ ఓ పదిరోజులపాటు పంచుకుని ఆనందం ఎలా... అంచెలంచెలుగా అనుభవించాలన్నదే మనవాడి బాధ.

భార్యొచ్చి ఆఫీసుకి టైమైందని గుర్తు చేసాగ్గానీ కింద నుండి లేవలేదు. అప్పటికే టైము పది కావొస్తోంది. గబగబా బాధానందాన్ని మనసు మూలకి నెట్టి, పది నిమిషాల్లో తయారై బయటపడ్డాడు.

రోడ్డుమీద కారులో వెళ్తున్నాడన్న మాటేగానీ, ఆలోచనలన్నీ భూకంపం చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి. సడన్‌గా భూమి కంపించి, రోడ్డు రెండుగా చీలిపోయి, తను కారుతో సహా పాతాళంలోకి కూరుకుపోతే...?...?...?, అసలు పాతాళంలో ఏముంటుందో?! ఆలోచనానందం అధికమై కారు రోడ్డు పక్కన ఆపాడు. సినిమాల్లోలా పాతాళంలో దేవలోకం ఉంటుందో లేక నాగలోకం ఉంటుందో... క్షణానికో సినిమా సెట్టింగు కళ్లముందు సిట్టవుతుంటే ఆ మధనంలో ఉప్పొంగిన ఆనంద ఝురిలో ఓలలాడుతున్న బ్రహ్మానందాన్ని ఆఫీసుకెళ్లాలన్న బాధ




సంకెళ్లేసి... లాక్కెళ్లింది.

ఆఫీసులో అడుగు పెట్టగానే ఎదురొచ్చిన రంగారావుని చూసి -

"రేయ్ రంగ్స్ (మనవాడి షార్ట్‌కట్ లెండి)! మొన్న మీ అబ్బాయి కాలేజీ అడ్మిషన్‌కి ఏభైవేలు కావాలన్నావుగా? దొరికాయా? లేదంటే నేను సర్దుతాను" అనేసరికి...

'వామ్మో! ఈ వేళ మనవాడి బాధావలలో చిక్కిన తొలి బక్కచేప తానేకాబోలనుకుని' బెంబేలెత్తిపోయాడు బ్రహ్మానందాన్ని జౌపోసపట్టిన రంగారావు.

వెంటనే రంగారావు... మనసులోకి బ్రహ్మానందం పరకాయ ప్రవేశం చేసి...

"వీడికి అప్పిస్తే తిరిగి ఇస్తాడా? లేకపోతే నుదిటిన నిలువుగా త్రీలైన్స్ పెడతాడా? వీడికి ఎల్టైసీ ఉందో?! లేదో?!... ఒకవేళ ఉంటే నా దగ్గర అప్పు తీసుకున్నట్టు నామినీకి చెబుతాడో లేదో! వంటి కుంటి దొట్లతో జౌట్లు పేల్తున్నట్టు మనవాడి మొహం కన్పిస్తుంటే బదులు చెప్పటం రాని మూగవానిలా నుంచున్న రంగారావుని చేత్తో తట్టేసరికి...

"ఆఁ..." అని ఉలిక్కిపడ్డాడు...

"ఏంట్రా రంగ్స్! మాట్లాడవు..." అడిగిన బ్రహ్మానందం వైపు బెరుకుగా చూసి...

"నో థ్యాంక్స్ రా! వద్దు! పి.ఎఫ్. లోను పెట్టాను" అని సున్నితంగా తిరస్కరించాడు.

"నీకు అవసర సమయంలో నేను గుర్తుకు రానందుకు సారీరా! ఇంతేనా మన పదిహేనేళ్ల స్నేహం" అంటూ ఆ పూట రంగ్స్ కన్పించిన చోటల్లా కెలుకుతూ బాధానందలహరి పొందుతున్న బ్రహ్మానందాన్ని భరించలేక...

"బాధ తీర్చతరమా? నీ బాధ తీర్చతరమా?" అని రంగ్స్ సినిమా గీతానికి ప్యారడీగా పాథాస్ ట్యూన్ కట్టుకుని, బ్రహ్మానందం కంట పడకుండా ఆఫీస్‌కి అఫ్‌డే లీవు పెట్టి ఇంటి మొహం పట్టాడు. దటీజ్! బ్రహ్మానందం... తస్మాత్ జాగ్రత్త. ●